పకడ్బందీగా డిజిటల్ కార్డుల తయారీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు తయారీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగనివ్వద్దని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన సూచించారు. జాబితా తయారీలో కుటుంబ సభ్యుల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. సిద్దిపేట పట్టణంలోని 34వ వార్డులో(పారుపల్లి వీధి)లో అధికారులు నిర్వహిస్తున్న ఎఫ్‌డీసీ ప్రక్రియను కలెక్టర్ మను చౌదరితో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు సూచనలు చేశారు. కొన్ని కుటుంబాలకు ఒకటి కంటే ఎక్కువ ఇళ్లు ఉంటే వారు ఎంపిక చేసుకున్న ఇంటి వివరాలే నమోదు చేయాలన్నారు. దాని ప్రకారమే కార్డు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే అత్యంత పారదర్శకతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హరిత హోటల్లో ఎఫ్‌డీసీ ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఎఫ్‌డీసీ ప్రక్రియ పరిశీలిస్తున్న రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్: డిజిటల్ కార్డు సర్వేను త్వరగా పూర్తి చేయాలని సీఎంఓ సంయుక్త కార్యదర్శి సంగీత అధికారులను ఆదేశించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని 17 వార్డులో జరుగుతున్న డిజిటల్ సర్వేను ఆమె తనిఖీ చేశారు. వివరాలను కలెక్టర్ మనుచౌదరి, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ ప్లీడర్ల నియామకం

సిద్దిపేట టౌన్: సిద్దిపేట జిల్లా కోర్టులకు నూతన ప్రభుత్వ ప్లీడర్లు నియామకమయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా సెషన్స్ కోర్టు, మొదటి అదనపు సెషన్స్ జడ్జి కోర్టులకు మంగు హరిహరరావు, జూనియర్ సివిల్ కోర్టులకు ఎం.డి. రఫీయుద్దీన్ నియామకమయ్యారు. వీరిని శనివారం జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు సన్మానించారు.

లలితా పరమేశ్వరి దేవిగా అమ్మవారు


వర్గల్ విద్యాసరస్వతి అమ్మవారు శనివారం లలితా పరమేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి సుందరంగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవమూర్తి గిరి ప్రదక్షిణలో వేద పాఠశాల విద్యార్థుల నృత్యాలు అలరించాయి. అనంతరం అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.
–న్యూస్‌టుడే, వర్గల్

సంస్కృతి, సంప్రదాయాల వారధి



బతుకమ్మ.. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ. అందరి బతుకును, బాగును కోరుకుంటుంది. జీవకోటి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉన్న తరుణాన కన్నతల్లిగా భావించి పూలతో పూజిస్తుండడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. సమాజం, సాంకేతికత, ఆధునికత మేళవింపుగా దూసుకెళ్తున్న ప్రస్తుత తరుణంలో నాటి సంప్రదాయం, సంస్కృతికి నేటి తరం యువత పెద్దపీట వేస్తుండటం విశేషం. పది రోజుల పాటు ఆనందోత్సాహాల మధ్య వేడుకలు కొనసాగుతాయి. ఊరూవాడ ఒక్కటవుతుంది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా మహిళలు, యువతులు సంబరాల్లో పాల్గొంటారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, గజ్వేల్ గ్రామీణ

ఆటాపాట..



బతుకమ్మ పాటలు కోకొల్లలు. వందలాది జానపద పాటలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రత్యేకంగా ఆల్బమ్స్ రూపొందిస్తున్నారు. నాటి పాటలను ఆధునికీకరించి విడుదల చేస్తున్నారు. యువతులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లయబద్ధంగా చప్పట్లతో ఆడిపాడుతున్నారు. కోలాటం, దాండియా నృత్యాలతో హోరెత్తిస్తున్నారు. వివిధ సందర్భాల్లో పాటల్లోని నూతనత్వం అందరినీ ఆకర్షిస్తున్నాయి. జానపద పాటలు విశేషాన్ని చాటుతున్నాయి.

సమష్టి తత్వం..

ఈ పండగ సమష్టి తత్వానికి ప్రతిబింబం. అప్పటివరకు ఇంటికే పరిమితమైన ఎంతో మంది మగువలు ఆరుబయట ఒకచోటికి చేరడంతో కొత్త స్నేహాలు చిగురిస్తున్నాయి. ఆప్యాయంగా మాట్లాడుకునేందుకు చక్కటి వేదిక. విద్యాసంస్థల్లో సంప్రదాయం తెలిసేలా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో యువతులు తమదైన శైలిలో ఆస్వాదిస్తున్నారు.

విశ్వవ్యాప్తం..

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే బతుకమ్మ వేడుకలు విశ్వవ్యాప్తమయ్యాయి. ఇతర రాష్ట్రాలు, దేశాలకూ వ్యాపించింది. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో చారిత్రక వైభవాన్ని చాటేలా వేడుకలు సాగుతున్నాయి. ఈ పండుగ.. సంగీతం, సాహిత్యం, నృత్యం, చిత్రం, శిల్పం మేళవింపని పరిశోధకులు చెబుతుంటారు.

ప్రాశస్త్యం వివరిస్తూ..

దసరాకు 13 రోజులు సెలవులు రాగా నవతరం.. మన సంస్కృతిని తెలుసుకునేందుకు చక్కటి సమయం ఇదే. కుటుంబమంతా ఒక చోటికి చేరుతోంది. ఊర్లలో ఉండే అమ్మమ్మ, నానమ్మల ఇళ్లకు వెళ్తున్నారు. పండుగ ప్రాశస్త్యం, విశిష్టత, బతుకమ్మ పాటలను ఆలపించే తీరు, ఆడిపాడే విధానాన్ని పెద్దలు వివరిస్తున్నారు.

పూలతో బతుకమ్మ..

ఘన కీర్తి కలిగిన బతుకమ్మ విశిష్టత కొనసాగుతుందనడానికి పూల బతుకమ్మనే నిదర్శనం. మెజార్టీ కుటుంబాలు పూలతో అలంకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. బతుకమ్మ పేర్చే విధానాన్ని యువత ఆసక్తిగా గమనిస్తూ నేర్చుకుంటున్నారు. ఇది సంస్కృతి వైపు మళ్లించేందుకు దోహదం చేస్తోంది. పర్యావరణ స్పృహ పెరుగుతుంది.

చెరువుల్లో నిమజ్జనం..



ప్రకృతిని గౌరవించే సంప్రదాయం మనది. పర్యావరణం, పూలు, నీళ్లు.. ఇవన్నీ మానవ సంబంధాలను బలపరుస్తాయి. బతుకమ్మను నీళ్లలో నిమజ్జనం చేయడం వల్ల జల వనరులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. పూలల్లో ఉండే ఔషధాలు వనరుల్లోని జీవరాశి సంరక్షణకు దోహదపడతాయి. చెరువుల వద్దకు అందరూ చేరుకొని అక్కడ ఆడిపాడి వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇది స్నేహ బంధాన్ని పెంచుతుంది.



ఆహార్యం.. అలంకరణ

మగువలు అలంకరణకు పెద్దపీట వేసే సమయమిది. అలంకరణ.. ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుంది. సృజనాత్మకతను ప్రతిబింబిస్తుంది. ఎంత ఆధునిక కాలమైనా.. యువతులు సంప్రదాయ వస్త్రధారణకు అత్యధికులు పెద్దపీట వేస్తున్నారు. చీర కట్టు, బొట్టులో అమ్మ, అమ్మమ్మ, నానమ్మలను అనుకరిస్తున్నారు.



స్నేహితులతో ఆడుతుంటే అనుభూతి చెప్పలేనిది



తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ. యువతులు, మహిళలకు ఎంతో ఇష్టమైనది. చిన్నప్పటి నుంచి ఆడుతున్నా. పండుగకు స్వగ్రామానికి వస్తా. స్నేహితులమంతా ఆడుతుంటే ఆ అనుభూతి చెప్పలేనిది.
– వైష్ణవి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, గజ్వేల్

వారం రోజుల సందడి



మా కాలంలో వారం రోజులు పిల్లాపాపలతో ఇల్లంతా సందడిగా ఉండేది. తీరొక్క పూలను సేకరించి మధ్యాహ్నానికి బతుకమ్మ తయారు చేసేవాళ్లం. సాయంత్రం గ్రామ కూడళ్ల వద్ద ఆట ఆడుతుంటే ఆ సంబరమే వేరు. - భీమ మల్లవ్వ, అహ్మదీపూర్


కోర్టు ఆవరణలో బతుకమ్మలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి, న్యాయమూర్తులు చందన, శ్రావణీయాదవ్

తీరొక్క పూలతో తీర్చిదిద్ది.. భక్తితో కొలిచి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబురాలు సిద్దిపేటలో ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి, న్యాయమూర్తులు చందన, శ్రావణీయాదవ్, టీఎన్జీవో భవన్‌లో ఉద్యోగినులు బతుకమ్మ ఆడారు. తీరొక్క పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది భక్తితో కొలిచారు. డీపీవో దేవకిదేవి, జిల్లా సంక్షేమ అధికారిణి శారద, జిల్లా ఆడిట్ అధికారిణి జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రాణి పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి.

సెలవుల్లో పిల్లలపై ఓ కన్నేయండి: సీపీ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పండుగ సెలవుల దృష్ట్యా పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ అనూరాధ సూచించారు. ఈ మేరకు శనివారం కమిషనరేట్ నుంచి ప్రకటన విడుదల చేశారు. పండుగ సెలవుల్లో అమాయక విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పకుండా నిండుగా ఉన్న చెరువులు, కుంటల్లో ఈత కోసం వెళ్లొద్దన్నారు. చిన్నారులకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదన్నారు. చరవాణులు ఉపయోగించేటప్పుడు ఓ కంట కనిపెట్టాలన్నారు. ఇంటి పరిసరాల్లో చెట్లు ఎక్కే ప్రయత్నం చేయొద్దన్నారు. అపార్టుమెంట్లలో ఉండే పిల్లలు అనవసరంగా లిఫ్టులు వాడొద్దన్నారు. ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇప్పించాలన్నారు.

సభ్యత్వ నమోదుకు స్పందన: భాజపా

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదుకు రాష్ట్ర వ్యాప్తంగా చక్కటి స్పందన వస్తోందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట పట్టణంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి బూతు స్థాయిలో 200 మందితో సభ్యత్వం చేయించే లక్ష్యంగా పని చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, వేణుగోపాల్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేటలో నాలుగు రోజులుగా కొనసాగిన డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. చివరి రోజైన శనివారం 67 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒకటికి మించి పోస్టులకు అర్హత సాధించిన 43 మంది అభ్యర్థుల్లో 27 మంది డిక్లరేషన్ సమర్పించారు. మరోవైపు 276 పోస్టుల నియామకం దిశగా 1:3 ప్రాతిపదికన ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు అభ్యర్థుల విద్యార్హత, ఇతరత్రా ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థులను ఆహ్వానించారు. జిల్లా విద్యా శాఖకు 758 మందితో కూడిన జాబితా చేరగా.. 704 మంది హాజరయ్యారు. ప్రక్రియను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షించారు.


వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన మక్కలు


తడిసిన మక్కలను చూపుతున్న రైతు


మెదక్ రోడ్డు వద్ద నిలిచిన నీరు, వాహనదారుల అవస్థలు

పంట వర్షార్పణం.. పట్టణం జలమయం

సిద్దిపేటలో శనివారం మధ్యాహ్నం గంటపాటు కురిసిన భారీ వర్షం పట్టణవాసులను అతలాకుతలం చేసింది. పత్తి మార్కెట్ యార్డులో ఆరబోసిన సుమారు 25 క్వింటాళ్ల మొక్కజొన్న తడిచిపోయింది. కొంత మేర కొట్టుకుపోయింది. దీంతో మక్కలను ఒక దగ్గరికి చేర్చి ఆరబోశారు. పంట అమ్ముకునే సమయంలో వర్షం తమను ముంచేసిందని రైతులు ఆవేదన చెందారు. మరో వైపు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా శివాజీనగర్, భరత్‌నగర్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పొంగి పొర్లాయి.
-న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

పేద విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి


నగదు ప్రోత్సాహకాలు అందుకున్న పది, ఇంటర్ విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పేద విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డా. సతీష్ పేర్కొన్నారు. ఇటీవల పది, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన పద్మశాలీ విద్యార్థులకు శనివారం పోపా భవన్‌లో సంఘం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. తొమ్మిది మంది పదో తరగతి విద్యార్థులకు రూ.8 వేలు, ఏడుగురు ఇంటర్ విద్యార్థులకు రూ.10 వేల చొప్పున మొత్తంగా రూ.1,42,000 అందజేశారు. నగదు ప్రోత్సాహకాలు అందించిన దాతలు పంతం చక్రపాణి, మామిడాల బాలకృష్ణ, డా. వల్లకోటి దేవందర్, లక్ష్మయ్య, మలిపెద్ది మల్లేశంలను సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి


ఆశాలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న బల్దియా అధ్యక్షురాలు మంజుల

సిద్దిపేట టౌన్: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ఆశా కార్యకర్తలు శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. కోమటిచెరువు కట్టపై ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బతుకమ్మ ఆడుతూ తమ సమస్యలు ఏకరవు పెట్టారు. వీరి నిరసనకు బల్దియా అధ్యక్షురాలు కడవేర్గు మంజుల, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్ మద్దతు తెలిపి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశా కార్యకర్తల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆశాలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవితబీమా సౌకర్యం కల్పించాలన్నారు. భారాస నాయకులు పాల సాయిరాం, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, నర్సింలు, శోభన్, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు రాయితీపై ఉపకరణాలు

మంత్రి తుమ్మల ప్రకటనతో అన్నదాతలకు లబ్ధి



న్యూస్‌టుడే, గజ్వేల్: సాగు ఉపకరణాలపై రైతులకు ఇచ్చే రాయితీని పునరుద్ధరిస్తామని, ఇందుకు ఏటా రాష్ట్రంలో రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం గజ్వేల్‌లో ప్రకటించిన నేపథ్యంలో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. దీంతో జిల్లా రైతాంగానికి లబ్ధి చేకూరనుంది.

ఫాం మెకనైజేషన్ పథకంలో భాగంగా గత ప్రభుత్వం ట్రాక్టర్లను అందజేసి సాగు సామగ్రి(గొర్లు, నాగళ్లు, తదితర పరికరాలు)ని పూర్తిగా నిలిపివేసింది. ఫలితంగా చిన్న, సన్నకారు రైతులకు సాగు పరికరాలు అందలేదు. మూడు కాళ్ల నాగళ్లు, రొప్పు గొర్లు, చిన్న ప్లావ్, పెద్ద ప్లావ్, ఆఫ్ కేజీ వీళ్లు(దమ్ములు), మందు పిచికారీ డబ్బాలు గతంలో రైతులకు సగం ధరకే రాయితీపై అందుబాటులో ఉండేవి. చిన్న, సన్నకారు రైతులు వీటిని కొనుగోలు చేసి సమయానికి అనుగుణంగా సాగు పనులు చేసుకునేవారు.

బడ్జెట్‌లో కేటాయింపులు లేక..

బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం మూలంగా రైతులకు పరికరాలు అందుబాటులోకి లేకుండా పోయాయి. బీటీ రోడ్లు పాడవుతున్నాయన్న కారణంగా ఫుల్ దమ్ముచక్రాలను రద్దు చేసిన సర్కారు ఆఫ్ దమ్ముచక్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటిని సైతం రైతులకు అందుబాటులో ఉంచకపోవడంతో బయట పూర్తి ధరకు కొనుగోలు చేస్తున్నారు.

అవసరాలు మెండుగా...

జిల్లాలో వానాకాలం, యాసంగి రెండు సీజన్లు కలిపి దాదాపు 8 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగు చేస్తుంటారు. ఇందులో పత్తి సాగు చేసే రైతులకు తప్పనిసరిగా మూడు కాళ్ల గొర్లు, కలుపు తీత దంతెలు అవసరం అవుతాయి. వరి నాటు వేసే సమయంలో నీరు పారేందుకు వినియోగించే రొప్పు గొర్లు అవసరం ఉంటాయి. ట్రాక్టర్లున్న రైతులకు ఆఫ్ దమ్ముచక్రాలు అవసరం ఉంటాయి. వీటి సరఫరా లేకపోవడంతో రైతులు నిట్టూర్చుతున్నారు. సొంతగా కొనుగోలు చేసి పెట్టుకున్న వారి వద్ద అద్దెకు తీసుకుంటున్నారు.

బయట రెట్టింపు ధరలకు విక్రయం

గొర్లకు విపరీతమైన డిమాండు ఉంది. ప్రభుత్వం రాయితీపై పరికరాలు ఇవ్వడం లేదని తెలిసి వ్యాపారులు మార్కెట్‌లో రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. రైతులకు సరిపడా పరికరాలు కావాలంటే జిల్లాకు ఏటా కనీసం రూ.30 కోట్ల మేర బడ్జెట్ అవసరం ఉంటుందని అంచనా. మొత్తంగా వ్యవసాయ ఉపకరణాలు రైతులకు రాయితీపై అందజేస్తామని మంత్రి చెప్పడంతో రైతులు స్వాగతిస్తున్నారు.

సింగరాయకు జలకళ



కోహెడ మండలంలోని సింగరాయ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నుండి జలకళ సంతరించుకుంది. అక్కడ ఉన్న మత్తడికి కొద్ది దూరంలో సింగరాయ నీటి సవ్వడులు ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడో దూర ప్రాంతంలో ఉన్న జలపాతం మాదిరి అనుభూతిని ఇక్కడి స్థానికులు పొందుతున్నారు.
-న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

కక్షిదారులను కోర్టుల చుట్టూ తిప్పొద్దు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి


జస్టిస్ రాధారాణికి వినతిపత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: పేదలకు సత్వర న్యాయసేవలు అందేలా చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కోర్టు సమావేశ మందిరంలో న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ... కక్షిదారులను కోర్టుల చుట్టూ తిప్పవద్దన్నారు. వారికి నష్టపరిహారం త్వరగా పంపిణీ చేసేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పని చేసి పేదలకు అండగా నిలవాలని కోరారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను త్వరగా పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవానీచంద్ర, న్యాయమూర్తులు జయంతి, సునీతా రవీంద్రారెడ్డి, కృష్ణార్జున్, లావణ్యబాల్‌రెడ్డి, రాధాకృష్ణా చౌహాన్, రమేశ్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కోర్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి న్యాయమూర్తికి వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల భవితకు నవోదయం

- ఉమ్మడి మెదక్ పరిధిలో వర్గల్‌లో ఏర్పాటు
- కొనసాగుతున్న ప్రవేశాల ప్రక్రియ

న్యూస్‌టుడే, వర్గల్



ప్రశాంతమైన వాతావరణం.. విలువలతో కూడిన నాణ్యమైన విద్య.. సామాజిక అంశాలపై అవగాహన.. గ్రామీణ ప్రాంతానికి చెందిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో జవహర్ నవోదయ పాఠశాలలు విద్యను అందిస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో వర్గల్‌లో ఏర్పాటు చేశారు. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విద్యాలయాల్లో త్వరలోనే ప్రవేశాలకు దరఖాస్తు గడువు ముగియనుంది.

- వర్గల్‌లో నవోదయ ఏర్పాటు: 1987
- ఏటా ప్రవేశాలు: 80 మందికి
- ఆరో తరగతిలో చేరికకు దరఖాస్తు గడువు: ఈ నెల 7

12వ తరగతి వరకు..

త్రిభాషా సూత్రం ప్రాతిపదికన సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా ఆరు నుంచి 12వ తరగతి వరకు విద్య అందిస్తున్నారు. ప్రవేశ పరీక్షలో రాణించిన 80 మంది బాలబాలికలకు ఏటా ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ నెల 7వ తేదీతో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ముగియనుంది. విద్యార్థులపై నిరంతరం నిఘా ఉంటుంది. అధ్యాపకుల పర్యవేక్షణలో స్టడీ తరగతులు కొనసాగుతాయి. విద్యార్థుల్లో జాతీయ సమైక్యతా భావం పెంపొందించేందుకు మైగ్రేషన్ విధానం అమలు చేస్తారు. ఇందులో భాగంగా 9వ తరగతి చదువుతున్న 21 మంది వర్గల్ విద్యార్థులు ఏటా హరియాణాలోని నవోదయ విద్యాలయంలో చదువు కొనసాగిస్తారు.


ఇటీవల నిర్వహించిన యూత్ పార్లమెంటరీ సమావేశం

ఉత్తమ సదుపాయాలు.. నాణ్యమైన విద్య

హైదరాబాద్ మినహా తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని వర్గల్ మండల కేంద్రంలో 1987 నుంచి నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అకాడమీ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలను వేర్వేరుగా వసతి సదుపాయాలు, బోధన, బోధనేతర సిబ్బంది, వారికి క్వార్టర్లు, విశాలమైన క్రీడా మైదానం ఏర్పాటు చేశారు. పర్యావరణహితంగా వృక్ష సంపద, అంతర్గతంగా సీసీ రోడ్లు నిర్మించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా 400 మీటర్ల ట్రాక్‌తో స్టేడియం నిర్మించారు. ప్రధాన క్రీడలన్నింటికీ కోర్టులున్నాయి. ఎన్‌సీసీలోనూ ఇక్కడి విద్యార్థులు రాణిస్తున్నారు. విద్యాలయంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు తదితర వసతులన్నీ ఉచితమే.

పీఎంశ్రీ పథకానికి ఎంపిక

కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకానికి వర్గల్ విద్యాలయం ఎంపికైంది. దీంతో విద్యాలయం పేరు పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంగా మారనుంది. దేశవ్యాప్తంగా 14,500 విద్యాలయాలను ఎంపిక చేయనుండగా అందులో వర్గల్‌కు అవకాశం దక్కింది. ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 7వ తేదీతో ముగియనుంది. 9, 11 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ఈ నెల 30వ తేదీ వరకు అంతర్జాలంలో దరఖాస్తు చేయవచ్చు. ఆరో తరగతిలో చేరేందుకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

వెలవెలబోతున్న విపణులు

- తగ్గిన సంప్రదాయ పంటల దిగుబడులు

న్యూస్‌టుడే, జహీరాబాద్

ఆహార, పప్పు ధాన్యాలు, తృణధాన్యాల లాంటి సంప్రదాయ పంటల సాగులో గతంలో ఉమ్మడి మెదక్ జిల్లా మేటిగా ఉండేది. ఎక్కువ మంది రైతులు పత్తి, సోయాబీన్ లాంటి వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతుండటంతో గత మూడేళ్లుగా సంప్రదాయ పంటల సాగు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది మరింత తగ్గింది. ఉన్న కాస్త పంటలు కోతకు వచ్చినప్పటికీ వరుసగా కురుస్తున్న వర్షాలతో.. ఆ పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ఏటా వినాయక చవితి నుంచి దసరా, దీపావళి వరకు ఆయా పంటల కోతలు, దిగుబడులతో గ్రామాల్లో సందడి ఉండేది. ధాన్యం బస్తాలు, అమ్మకందారులు, కొనుగోలు దారులతో విపణులు కిటకిటలాడేవి. ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు.


కళతప్పిన జహీరాబాద్ మార్కెట్ యార్డు

ఆహార ఉత్పత్తుల కొరత


సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు నియోజకవర్గాల్లో ఎక్కువ మంది రైతులు వానాకాలం సీజన్‌లో ప్రధానంగా పెసర, మినుము, కందులు, జొన్నలు, మొక్కజొన్న తదితర సంప్రదాయ పంటలు వేస్తుంటారు. సెప్టెంబరు రెండో వారం నుంచి అక్టోబరు మొదటి వారం వరకు పెసర, మినుము పంటలు కోతలు వస్తుంటాయి. అక్టోబరు నెలాఖరు వరకు సోయాబీన్, మొక్కజొన్న ఉత్పత్తులు చేతికి వస్తుంటాయి. దాదాపు నెలన్నరగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆయా పంటలు తడిసి.. 30శాతం దిగుబడులయినా రావడం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క జహీరాబాద్ విపణికి గతంలో రోజుకు 4 వేల నుంచి 5వేల బస్తాల దిగుబడులు వివిధ పంటలకు సంబంధించి వచ్చేవి. దీంతో కొనుగోళ్లు, తూకాలతో అర్ధరాత్రి వరకు సందడి ఉండేది. ప్రస్తుతం రోజుకు 500 బస్తాలైనా రావడం లేదంటే పరిస్థితిని అంచనా వేయవచ్చు.

సార్వత్రిక విద్య దరఖాస్తు గడువు పెంపు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సార్వత్రిక విద్య పది, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండి.. చదువు మధ్యలో మానేసిన వారు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు మాత్రమే ఇంటర్‌లో చేరేందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆనందం.. అంతలోనే విషాదం

- మరికొద్ది గంటల్లో కుమారుడి పెళ్లి
- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి


ఖాసీం

తొగుట, రాయపోల్, న్యూస్‌టుడే: మరికొద్ది గంటల్లో కుమారుడి పెళ్లి.. బంధువులు రావడంతో ఆ ఇంట సంబరాలు మొదలయ్యాయి. పెళ్లి గడియలు సమీపిస్తున్న తరుణంలో అంతలోనే ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పెళ్లి కొడుకు తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో పెళ్లి బాజాలు మోగాల్సిన ఇంట్లో విషాదఛాయలు అలుముకున్న సంఘటన రాయపోల్ మండలంలోని మంతూర్‌లో శనివారం ఉదయం చోటు చేసుకుంది. తొగుట ఎస్సై రవికాంతరావు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. ఖాసీం అలీ(73) చిన్న కుమారుడు నిజాముద్దీన్ పెళ్లి శనివారం ఉదయం 10 గంటలకు జరగాలి. కార్యక్రమంలో భాగంగా మరో కుమారుడు వసియోద్దీన్ తన తండ్రి ఖాసీం అలీ, తల్లి సాహెరాతో అలీతో కలిసి గజ్వేల్ నుంచి కారులో తిరిగి వస్తున్నాడు. తెల్లవారుజామున వెంకట్రావుపేట శివారులో అడ్డుగా వచ్చిన అడవి పందిని తప్పించబోయి అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఖాసీం అక్కడికక్కడే మరణించగా అతని భార్య సాహెరా, కుమారుడు వసీయుద్దీన్‌కు గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని ఆస్పత్రికి తరలించారు. పెద్ద కుమారుడు యాసిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు..


గూనయ్య

చేగుంట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడటంతో యువకుడు మృతిచెందిన ఘటన చేగుంట మండలం పొలంపల్లి వద్ద శనివారం జరిగింది. స్థానిక ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. వెల్దుర్తి మండలం బండమీదిపల్లికి చెందిన గంపల గూనయ్య(28) చిన్నశంకరంపేట మండలం చందంపేటలో ఉన్న ఓ పరిశ్రమలో కూలీ పనులు చేస్తుంటాడు. ఆయనకు చేగుంట మండలం రుక్మాపూర్‌కు చెందిన యువతితో ఆరు నెలల క్రితం వివాహమైంది. మధ్యాహ్నం భోజనం చేసేందుకు పరిశ్రమ నుంచి వచ్చి మెదక్ వెళ్లే మార్గంలో అతివేగంగా వెళ్తుండగా పొలంపల్లి దాటిన తర్వాత ద్విచక్రవాహనం అదుపు తప్పటంతో కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ బోల్తాపడటంతో..

చేగుంట, న్యూస్‌టుడే: పాత ఇనుప సామగ్రితో వెళ్తున్న వాహనం రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొని బోల్తాపడటంతో అందులో కూర్చున్న వ్యక్తి మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలం బల్లాలపల్లి గ్రామానికి చెందిన మంత్రియల్ల నాగయ్య(43).. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ శివరాంపల్లిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అడ్డా కూలీగా పనులు చేస్తుంటాడు. గురువారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పాత ఇనుమ సామాను తీసుకొచ్చేందుకు చిన్నలారీలో బయలుదేరాడు. రాత్రి అక్కడి నుంచి డ్రైవర్‌తో కలిసి తిరిగి వస్తున్నారు. చేగుంట జాతీయ రహదారి బైపాస్ వంతెన వద్ద డ్రైవర్ అతివేగంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో లారీ బోల్తాపడింది. క్యాబిన్‌లో కూర్చున్న నాగయ్య అందులో నుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని 108 వాహనంలో కొంపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు వెళ్తుండగా..


దుర్గయ్య

గుమ్మడిదల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం గ్రామానికి చెందిన కోరబోయిన దుర్గయ్య(56) అన్నారం పరిధిలోని వాయుసేన అకాడమీలో ఒప్పంద కార్మికుడిగా పనిచేస్తున్నారు. శనివారం స్వగ్రామం నుంచి విధులకు హాజరయ్యే నిమిత్తం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అన్నారం సమీపంలో వెనుకవైపు నుంచి వచ్చిన మరొక ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గయ్య రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

న్యాల్‌కల్, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం వడ్డీ గ్రామంలో చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కోడె చంద్రప్ప(55) వాళ్ల చిన్ననాన్న మరుతప్ప ఇంటి వద్దనున్న పశువులపాకలో ఆవులను కట్టేసి వస్తానని వెళ్లాడు. అక్కడ డ్రైనేజీ నిండటంతో చెత్తను తీసివేసే క్రమంలో బసవేశ్వర గుడి దగ్గర డెకరేషన్ నిమిత్తం ఏర్పాటు చేసిన సీరియల్ లైటింగ్ తీగలు ఆయనకు తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీనిని గమనించిన ఆయన భార్య శాంతమ్మ రక్షించడానికి వెళ్లగా ఆమెకు కూడా విద్యుదాఘాతం తగలడంతో పక్కకు జరిగింది. అచేతనంగా పడిఉన్న తన భర్తను గ్రామస్థుల సాయంతో బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

ఖేడ్ ప్రాంతం.. గునుగు పూలకు ప్రత్యేకం



బతుకమ్మలను పేర్చడంలో గునుగు పూలదే ప్రత్యేకం. బీడు భూములు, చేల ఒడ్డున, కంది, పెసర, మినుము తదితర పంటల్లో కలుపు మొక్కల్లా పెరుగుతుంటాయి. ఖేడ్ ప్రాంతంలో సాగునీటి వనరులు తక్కువ. బీడుభూములు అధికంగా ఉంటాయి. ఈ ప్రాంతంలో గునుగుపూల మొక్కలు ఎక్కడచూసినా కనిపిస్తుంటాయి. జిల్లాతోపాటు పొరుగున ఉన్న కామారెడ్డి, మెదక్‌లకు చెందిన చాలా మంది ఇక్కడి గునుగు పూలను వాహనాల్లో తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలలో జిల్లాలోని జోగిపేట, మెదక్ జిల్లాలోని పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్, పాపన్నపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలోని పిట్లం, నిజాంసాగర్, నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ తదితర ప్రాంతాలకు పూలను తరలిస్తున్నారు. – న్యూస్‌టుడే, నారాయణఖేడ్



నక్కవాగులో హరిత సోయగం



హత్నూర-సంగారెడ్డి మండలాల సరిహద్దు మీదుగా ప్రవహిస్తున్న నక్కవాగు ప్రకృతి రమణీయతతో ఆకట్టుకుంటోంది. పరీవాహకంలో ఎక్కడ చూసినా హరిత సోయగాలు, వాగు పరవళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వాగు పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఆరంభమై 25 కి.మీ. ప్రవహించి హత్నూర మండలం పల్పనూరు వద్ద మంజీరా నదిలో కలుస్తుంది. –న్యూస్‌టుడే, హత్నూర

వేర్వేరు చోట్ల నలుగురి బలవన్మరణం

నాలుగు గ్రామాల్లో నలుగురు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి కుటుంబాల్లో విషాదాన్ని నింపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ..


ఎల్లేష్

తూప్రాన్, న్యూస్‌టుడే: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. వెంకటాయపల్లికి చెందిన కిష్టారం ఎల్లేశ్(35)కు 13 ఏళ్ల క్రితం మెదక్‌కు చెందిన యాదమ్మతో వివాహమైంది. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. కుటుంబ కలహాలతో భార్య యాదమ్మ ఏడాదిన్నర క్రితం పుట్టింటికి వెళ్లింది. పెద్దల సమక్షంలో మాట్లాడి ఆమెను తీసుకొచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించాడు. అయినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన ఎల్లేశ్ శుక్రవారం రామాలయం శివారులో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృత్యువాతపడ్డాడు.

కడుపునొప్పి భరించలేక యువకుడు..


తరుణ్

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మిరుదొడ్డి మండలం అందే గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై పర్శురాములు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రాణి, నాగరాజు దంపతుల ఏకైక కుమారుడు తరుణ్(19). డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. 20 ఏళ్ల క్రితం తండ్రి నాగరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ భారాన్ని మోస్తున్న తల్లి రాణికి తరుణ్ ఆసరాగా నిలిచాడు. ఓ వైపు చదువుతూనే మరోవైపు టెంట్ హౌస్, డీజే కూలీ పనులకు వెళ్లేవాడు. అయితే గత 15 రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం పలు ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించినా తగ్గలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై తరుణ్ శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. వెంటనే చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

చికిత్స పొందుతూ మహిళ ..

జగదేవపూర్, న్యూస్‌టుడే: మండలపరిధి మునిగడపలో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కాంబ్లే బాలమణి(48) అనారోగ్యంతో బాధపడుతూ తన తల్లిగారి ఊరైన జగదేవపూర్ మండలం మునిగడపకు 4 నెలల కిందట వచ్చింది. ఆమెకు హైదరాబాదులో చికిత్స అందించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనోవేదనకు గురైన బాలమణి శుక్రవారం తన తల్లికి చెందిన పొలం వద్ద గడ్డిమందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గజ్వేల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సిద్దిపేట ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య


సురేష్

కొత్తూర్(కె)కోహీర్, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కొత్తూర్(కె)లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై గోపతి సతీష్ కథనం ప్రకారం... కొత్తూర్(కె)కు చెందిన సురేష్(29)కు సదాశివపేటకు చెందిన సంధ్యారాణితో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. సురేష్ జహీరాబాద్ సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. దీంతో ఆరు నెలల కిందట సంధ్యారాణి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన సురేష్ శనివారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు సురేష్ సోదరుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

సజీవ దహనం కేసులో ఆరుగురికి రిమాండ్


నిందితులను చూపుతున్న సీఐ వెంకట రాజా గౌడ్

రామాయంపేట, న్యూస్‌టుడే: చేతబడి అనుమానంతో మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించి ఆమె మృతికి కారణమైన ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ వెంకటరాజా గౌడ్ తెలిపారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. రామాయంపేట మండల పరిధి కాట్రియాల గ్రామానికి చెందిన పోచవ్వ హైదరాబాదులో నివాసం ఉంటూ ఇటీవల గ్రామానికి వచ్చింది. అయితే ఆమె అనారోగ్యానికి అదే గ్రామానికి ద్యాగల ముత్తవ్వ(48) కారణమని ఆరోపిస్తూ ఇంటికి వెళ్లి కట్టెలతో తీవ్రంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పంటించారు. దీంతో ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దాయాదులైన ద్యాగల రామస్వామి, మురళి, శేఖర్, లక్ష్మి, రాజ్యలత, మహాలక్ష్మి, పోచవ్వపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇందులో ఆరుగురిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఇరువర్గాలకు గతంలో భూతగాదాలు ఉన్నాయని సీఐ తెలిపారు. ఎస్సై బాలరాజు, కానిస్టేబులు శ్రీనివాస్, మౌనిక ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


సాత్విక్ శర్మ

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన చేపూరి సాత్విక్ శర్మ ఎస్జీఎఫ్ పోటీల్లో భాగంగా అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపిక పోటీల్లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో రాణించాడు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

'హ్యాండ్‌బాల్' క్రీడలో జాతీయస్థాయికి వికాస్‌గౌడ్



చేర్యాల, న్యూస్‌టుడే: మద్దూరు మండల కేంద్రానికి చెందిన వికాస్‌గౌడ్ హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి సబ్‌జూనియర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడని, హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో జరుగుతున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్నాడని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి ఉపేందర్ తెలిపారు.

పశుజాతి వృద్ధి.. క్షీర సిద్ధి

- గేదెలకు కృత్రిమ గర్భధారణలో రాష్ట్రంలో ఉమ్మడి మెదక్‌కు ప్రథమ స్థానం

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

- జూన్ నుంచి సెప్టెంబరు వరకు..
- ఆన్‌లైన్‌లో నమోదయినవి: 1004
- కృత్రిమ గర్భధారణ చేసిన గేదెల సంఖ్య: 1432
- ఈ లెక్కన ఉమ్మడి మెదక్ స్థానం: ద్వితీయ
- ఈ లెక్కన రాష్ట్రంలో ఉమ్మడి మెదక్ స్థానం: ప్రథమ
- మొత్తం గోపాలమిత్రలు: 140

రైతులు ఆర్థిక వృద్ధి సాధించేందుకు పంటల సాగుతో పాటు పాడిపరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. వీరిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా పశుజాతి వృద్ధికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. కృత్రిమ గర్భధారణ(ఏఐ) ద్వారా పశువులకు ఎక్కువగా ఆడ దూడలే పుట్టిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా గోపాలమిత్రలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పశుగణాభివృద్ధి సంస్థ(డీఎల్‌డీఏ) గేదెలకు కృత్రిమ గర్భధారణలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

రాష్ట్ర స్థాయి గుర్తింపు

డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో జూన్ నుంచి ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. కృత్రిమ గర్భధారణ విధానంలో 90 శాతం ఆడ దూడలే పుట్టే అవకాశం ఉంది. ఆడ దూడల సంఖ్య పెరిగితే పాల దిగుబడి వృద్ధి చెంది పశుపోషకులకు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటి వరకు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో కలిపి మొత్తం 1432 గేదెలకు కృత్రిమ గర్భధారణ చేశారు. సాంకేతిక సమస్యల కారణంతో వీటిలో 1004 మాత్రమే అంతర్జాలంలో నమోదు చేశారు. కృత్రిమ గర్భధారణలో ఆన్‌లైన్ పరంగా ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం, ఆఫ్‌లైన్ పరంగా ప్రథమ స్థానంలో ఉంది.

మూడేళ్లకే పాల దిగుబడి

ఈ పథకంలో భాగంగా పుట్టిన ఆడ దూడ 18 నెలలకే చూడికి వస్తుంది. మూడేళ్లకే మరో దూడకు జన్మనిస్తుంది. దీంతో రైతుకు కేవలం మూడేళ్లకే పాల దిగుబడి ప్రారంభమై ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పథకానికి జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నోడల్ మానిటరింగ్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది.


కృత్రిమ గర్భధారణతో జన్మించిన లేగదూడ

సద్వినియోగం చేసుకోవాలి

డీఎల్‌డీఏ పథకం ద్వారా మేలు జాతి దూడలు జన్మిస్తున్నాయి. ఇలాంటి వాటిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే అధిక వ్యయమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గేదెలు ఇక్కడి వాతావరణానికి సర్దుబాటు కాకపోవడంతో పాల దిగుబడి తగ్గుతుంది. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశంతో రైతులు కేవలం రూ.250 వ్యయంతో గేదెకు కృత్రిమ గర్భధారణ చేయించవచ్చు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.


- డాక్టర్ రాంజీ, సీఈవో(డీఎల్‌డీఏ), ఉమ్మడి మెదక్

ఎస్జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

ధన్వాడ, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ బాలికల రెజ్లింగ్ పోటీలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు బహుమతులు అందుకున్న వారిలో ఉన్నారు. అండర్-14కు సంబంధించి 46 కిలోల విభాగంలో సాత్విక, 58 కిలోలకు సంబంధించి బి.అర్చన, అండర్-17 విభాగంలో 53 కిలోలకు సంబంధించి లక్ష్మీప్రియ, 61 కిలోల్లో సంతోష పోటీల్లో ప్రతిభ చూపారు. జాతీయ స్థాయిలో పాల్గొననున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	114-00
రిటైల్	136-00
డ్రెస్ట్	197-00
స్కిన్‌లెస్	224-00

'ఉపాధి' పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న అదనపు పీడీ బాలకృష్ణ తదితరులు

దుబ్బాక, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద పలు గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్రస్థాయి సహాయకులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ అదనపు పీడీ బాలకృష్ణ అన్నారు. శనివారం దుబ్బాక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 సంవత్సరానికిగాను ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఉపాధి హామీలో చేపట్టిన పనులు, వినియోగించిన నిధులు, పనుల ఎంపిక వంటి దాదాపు 36 అంశాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులకు రూ.75 వేల జరిమానా, రూ.48 వేల రికవరీకి ఆదేశించారు. అంబుడ్స్‌మెన్ ఆరిఫ్, ఎంపీడీవో భాస్కరశర్మ, పీఆర్ ఏఈ రిజ్వాన్, ఏపీవో శ్యామ్, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

రైతులందరి రుణాలు మాఫీ చేయండి: సీపీఎం

చేర్యాల, న్యూస్‌టుడే: ఎలాంటి కొర్రీలు లేకుండా రూ.2లక్షల వరకున్న రైతుల రుణాలు మాఫీ చేయాల్సిందేనని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. కొమురవెల్లి మండలం రాంసాగర్‌లో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తాడూరి రవీందర్, మల్లేశం, గోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

పురపాలికలో కానరాని స్వచ్ఛత

న్యూస్‌టుడే, దుబ్బాక: పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నా ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. 20 వార్డులు, 40 వేల జనాభా ఉన్న దుబ్బాక పురపాలికలో సిబ్బంది నిర్లక్ష్యంతో ఎక్కడా స్వచ్ఛత కానరావడం లేదు. ఏ వార్డులో చూసినా పాలిథీన్ సంచులు, ఇతర వ్యర్థాలు, మురుగుతో నిండిన మురుగు కాల్వలే దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని అంగడి బజార్‌లోని పుర దుకాణ సముదాయం వెనుక ఉన్న మురుగు కాల్వ పూర్తిగా వ్యర్థాలతో నిండి, దుర్వాసన వెదజల్లుతోంది. పురపాలికలో అస్తవ్యస్తంగా మారిన పారిశుద్ధ్య నిర్వహణపై కథనం..

ఎక్కడ చూసినా అదే పరిస్థితి

పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద ఉన్న హోటళ్లు, మొబైల్ టిఫిన్ సెంటర్ల వల్ల అక్కడి మురుగు కాల్వ పూర్తిగా వ్యర్థాలతో నిండి, నీరు నిలిచి, పరిసరాలు కంపు కొడుతున్నాయి. అంగడి బజారు నుంచి చీకోడ్‌కు వెళ్లే మార్గంలోని మురుగు కాల్వలు పిచ్చి మొక్కలు, గడ్డి, వ్యర్థాలతో నిండాయి. ప్రతి శనివారం అంగడి బజార్‌లో పెద్ద ఎత్తున జరిగే సంత ముగిశాక వ్యర్థాలను అక్కడే పడేస్తున్నారు. వాటిని తీసివేసి శుభ్రం చేయాలనే ఆలోచన పుర సిబ్బందిలో కానరావడం లేదు.

సిబ్బంది కొరత

పలు వార్డుల్లో మురుగు కాల్వలను 3, 4 నెలలైనా శుభ్రం చేయడం లేదని, పాలక వర్గానికి విన్నవించినా స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలు వ్యర్థాలతో నిండడం వల్ల దోమలు, ఈగలు వ్యాప్తి చెంది మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురపాలికలో గత రెండేళ్లుగా పారిశుద్ధ్య అధికారి(శానిటరీ ఇన్‌స్పెక్టర్) లేకపోవడంతో నిర్వహణ కరవైంది. బల్దియాలో 40 వేల జనాభాకు 43 మంది మాత్రమే పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. ఇటీవల కొంతమంది సిబ్బందిని ప్రైవేట్‌గా నియమించి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో స్వచ్ఛత కానరావడం లేదు. పుర సిబ్బంది పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పుర దుకాణ సముదాయం వెనుక మురుగు కాల్వ దుస్థితి

చర్యలు తీసుకుంటాం: పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణపై మరింత దృష్టి పెట్టాం. ఇటీవల మరికొంత మంది ప్రైవేట్ కార్మికులను నియమించి పరిసరాల శుభ్రతను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
కె.రమేశ్ కుమార్, పుర కమిషనర్, దుబ్బాక

ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించొద్దు: జేవీవీ

సిద్దిపేట, న్యూస్‌టుడే: రామాయంపేట మండలం కాట్రియాలలో చేతబడి చేసిందనే నెపంతో ఓ మహిళను దాయాదులు సజీవ దహనం చేయడం అమానుషమని, ఇలాంటి ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు మొలుగు బాలరాజు అన్నారు. సిద్దిపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కోశాధికారి అజీజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మూఢనమ్మకాలు విశ్వసించొద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో అలాంటి వ్యాప్తిని అరికట్టాలన్నారు. సంఘ ప్రతినిధులు కిషన్, శేఖర్, నర్సింలు, గిరి తదితరులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకల్లో మంత్రి సతీమణి

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ గ్రామపంచాయతీ వాణిజ్య సముదాయం ఆవరణలో శనివారం జరిగిన బతుకమ్మ వేడుకల్లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సతీమణి మంజులగౌడ్ పాల్గొన్నారు. స్థానిక మహిళలను పరిచయం చేసుకొని బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఆమెతోపాటు కాంగ్రెస్ మహిళా నాయకురాలు మంజుల రెడ్డి, తహసీల్దారు సురేఖ, ఎంపీవో శోభ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చర్యలతో గంగపుత్రులకు అన్యాయం: వంటేరు

గజ్వేల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం గంగపుత్రులకు తీవ్ర అన్యాయం చేస్తుందని భారాస సీనియర్ నేత, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శనివారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. గంగపుత్రులకు ఉపాధి కల్పించేందుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏటా చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను వదిలి చేతినిండా పని కల్పించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముదిరాజ్‌లు, గంగపుత్రులను పూర్తిగా మరిచిపోయిందన్నారు. వర్షాకాలం సీజన్ ముగిసిపోతున్నా ఇప్పటికీ చాలా చెరువుల్లో చేపపిల్లలు వేయలేదన్నారు. జిల్లాలో వేలాది కుటుంబాలు చెరువులను ఆదరువుగా చేసుకుని జీవనం సాగిస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని చెరువులు, కుంటల్లో చేపపిల్లలను వదిలి గంగపుత్రులకు భరోసా కల్పించాలన్నారు.



సిద్దిపేట: అన్నపూర్ణ మాతగా లలిత పరమేశ్వరి



సిద్దిపేట: పాత మార్కెట్ వద్ద వాసవి త్రిశూల్ యూత్ ఆధ్వర్యంలో..



సిద్దిపేట: మంగమ్మతోట ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

అన్నపూర్ణగా లలిత పరమేశ్వరి

సిద్దిపేట, చేర్యాల, బెజ్జంకి, మిరుదొడ్డి, నంగునూరు, దుబ్బాక, చిన్నకోడూరు, గజ్వేల్ గ్రామీణ, కొండపాక గ్రామీణం, కోహెడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు.. అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చన, చండీహోమం, తదితర ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. మహిళా భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు కిరణ్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అమ్మ నామస్మరణలతో మండపాలు మార్మోగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.



కొండపాక గ్రామీణం: అన్నపూర్ణ దేవిగా విజయదుర్గ

చివరి దశకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: అక్కన్నపేట మండలం నందారంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే చివరిదశకు చేరింది. ఈ నెల 3న గ్రామంలో సర్వే ప్రారంభించారు. ఎంపీడీవో బానోతు జయరాం, తహసీల్దారు అనంతరెడ్డి, మండల పరిషత్తు సూపరింటెండెంట్ శంకరయ్య నేతృత్వంలో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు నిర్వహించిన సర్వేలో మొత్తం 234 కుటుంబాల వివరాలు సేకరించినట్లు అక్కన్నపేట ఎంపీడీవో తెలిపారు. శనివారం ఈ సర్వేను హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా ఉంటే వారి వివరాలు నమోదు చేస్తామన్నారు.



నందారంలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో రామ్మూర్తి

సందడిగా బతుకమ్మ సంబరాలు

కొండపాక (గ్రామీణం), హుస్నాబాద్, న్యూస్‌టుడే: కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, కొండపాక జూనియర్ కళాశాలలో విద్యార్థినులు వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చి మహిళలు ఆడిపాడుతూ సందడిగా గడిపారు. అనంతరం రాత్రికి స్థానిక చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్నారు.



హుస్నాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులు

100 వాహనాలపై అతివేగం కేసులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. అదే వేగం ఎప్పటికైనా ప్రమాదకరమన్నారు. పట్టణంలోని రాజీవ్‌రహదారి ఇబ్రహీంనగర్ శివారులో శనివారం వేగంగా వెళ్తున్న వాహనాలను స్పీడ్ లేజర్‌గన్‌తో ఆయన పరిశీలించారు. ఈ మేరకు అధిక వేగంతో వెళ్తున్న 100 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగల నేపథ్యంలో కుటుంబ సభ్యులతో వెళ్లేవారు జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. కచ్చితంగా శిరస్త్రాణం, సీట్ బెల్టులు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పీడ్ లేజర్ గన్ ఆపరేటర్ జగదీశ్వర్ ఉన్నారు.



స్పీడ్ లేజర్‌గన్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

కూరగాయల సాగుతో రైతులకు లాభాలు



కుందన్‌వానిపల్లిలో కూరగాయల పంటను పరిశీలిస్తున్న ఉద్యానాధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్ గ్రామీణం), న్యూస్‌టుడే: కూరగాయల సాగుతో రైతులు మంచి లాభాలు పొందవచ్చునని జిల్లా ఉద్యాన అధికారిణి సువర్ణ అన్నారు. శనివారం అక్కన్నపేట రైతు వేదికలో కూరగాయల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. వీటి సాగు విస్తీర్ణం పెంచేందుకు కలెక్టర్ మనుచౌదరి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు. అక్కన్నపేట మండలం గండిపల్లిలోని ప్రసిద్ధ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. ముందుకొచ్చిన రైతులకు విత్తనాలు, డ్రిప్, పందిరి, మల్చింగ్, సోలార్‌ఫెన్సింగ్ తదితర విషయాల్లో రాయితీలు ఇస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారిణి రాధిక, శాస్త్రవేత్తలు నాగరాజు, నవీన్ మాట్లాడారు. అనంతరం కుందన్‌వానిపల్లిలో కూరగాయల పంటలను పరిశీలించారు. ఉద్యాన అధికారిణి కౌసల్య, ఏడీఏ శ్రీనివాస్, ఏవో నాగరాజు, ఏఈవోలు, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రవళి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలని వినతి

గజ్వేల్, న్యూస్‌టుడే: కారుణ్య విధానం ద్వారా వీఆర్ఏల నియామకాలను చేపట్టాలని ఆ సంఘం ఆధ్వర్యంలో నాయకులు శనివారం గజ్వేల్‌లో ఆర్డీవో బన్సీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. 61 ఏళ్లు పైబడిన వీఆర్ఏల వారసులను విధుల్లోకి తీసుకుంటామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా.. అమలుకు నోచుకోలేదని పలువురు వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికులకు బోనస్ ఇవ్వాలి: సీఐటీయూ

గజ్వేల్, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో పనిచేస్తున్న ఒప్పంద, శాశ్వత కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన శనివారం గజ్వేల్‌లో మాట్లాడుతూ.. 1965 బోనస్ చట్టం ప్రకారం పరిశ్రమ లాభనష్టాలతో సంబంధం లేకుండా బోనస్ చెల్లించేలా కార్మిక శాఖ, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కృషి

హుస్నాబాద్ గ్రామీణం: గౌడ కులస్తుల సంక్షేమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృషి చేస్తున్నట్లు గౌడసంఘం హుస్నాబాద్ నియోజకవర్గ ఛైర్మన్ మార్క అనిల్‌గౌడ్ అన్నారు. శనివారం హుస్నాబాద్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడారు. కల్లుగీత కార్మికుల ఉపాధి కోసం తాటి, ఈత మొక్కలు తెప్పించి గ్రామాల్లో నాటించారన్నారు. సర్వాయిపేటలోని కొమ్ముగుట్టను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు రూ.4.70కోట్లు మంజూరు చేయించారన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో పుట్టడం గర్వకారణం: ఆర్ఎస్ఎస్

గజ్వేల్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు దేశం కోసం పనిచేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) తెలంగాణ ప్రాంత ప్రచారక్ శ్రీధర్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం గజ్వేల్‌లో విజయదశమి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐవోసీ మైదానం నుంచి అంగడి హనుమాన్ దేవాలయం, ఇందిరా పార్కు చౌరస్తా, వివేకానంద చౌక్ మీదుగా కార్యస్థలి ఐవోసీ మైదానం వరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు దిశా నిర్దేశనం చేసే సత్తా భారత్‌కు ఉందని, ఇలాంటి దేశంలో మనం పుట్టినందుకు గర్వపడాలన్నారు.



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

మాది పేదల ప్రభుత్వం: కాంగ్రెస్



బాధితుడికి ఎల్‌వోసీ అందిస్తున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్: మాది ముమ్మాటికీ పేదల ప్రభుత్వమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరుకు చెందిన వల్లపు నాగరాజు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయాన్ని మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి రూ.50 వేల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. శనివారం సిద్దిపేటలో నాగరాజు కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీని హరికృష్ణ అందజేశారు.

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ మండలం కొల్గూర్‌కు చెందిన పలువురు అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఇటీవలే నిధులు మంజూరు కాగా శనివారం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

వెంకటస్వామికి ఘన నివాళి

హుస్నాబాద్, చేర్యాల, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. శనివారం స్థానిక పురపాలికలో పురాధ్యక్షురాలు ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సహకార సంఘం ఛైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తితోపాటు పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. చేర్యాల బల్దియా కార్యాలయంలో పురాధ్యక్షురాలు స్వరూపారాణి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మేనేజరు ప్రభాకర్, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, పాల్గొన్నారు.




హుస్నాబాద్‌లో వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పురాధ్యక్షురాలు రజిత, తదితరులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

కోహెడ, న్యూస్‌టుడే: కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మహమూద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ట్రయాథ్లిన్ పోటీల్లో సీ.హెచ్.శ్రీవిక, లాంగ్‌జంప్‌లో ఫైజున్నీసా ఎంపికయ్యారు. వీరు ఈనెల 7, 8 తేదీలలో హనుమకొండ జవహర్‌లాల్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. పీఈటీ డి.పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన



మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

వర్గల్: విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా సామాజిక అంశాలపై వారికి అవగాహన కల్పించడానికి బ్యాగ్ లెస్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపల్ రాజేందర్ పేర్కొన్నారు. వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో పుస్తక రహిత దినోత్సవాలు రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు సంచికి దూరంగా ఉంటూ పరిసరాల శుభ్రత, నృత్యాలు, వంటివి నేర్చుకుంటున్నారు. నర్సరీలో మొక్కల పెంపకం తదితర అంశాలపై నర్సరీ నిర్వాహకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

'వర్గీకరణ లేకుండా పోస్టుల భర్తీ అన్యాయం'

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ లేకుండా టీచర్ పోస్టులను భర్తీ చేయడం మాదిగలకు అన్యాయం చేయడమేనని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పర్శరాములు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణమాదిగ అన్నారు. సిద్దిపేటలో శనివారం వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి.. వర్గీకరణ అమలు చేస్తామని అసెంబ్లీలో హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి.. టీచర్ పోస్టులను ఆ విధంగా భర్తీ చేయకపోవడం సరికాదన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కాపల్లి రాజు, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి సుంచు రమేష్, నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగదేవపూర్, న్యూస్‌టుడే: మండల పరిధి మునిగడపలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తలారి సాయిలు అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊరికి వెళ్లారు. శుక్రవారం రాత్రి ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు ఇంట్లోని బీరువా తెరచి అందులో ఉన్న రూ.40 వేల నగదు, 10 గ్రా. బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ తెలిపారు. బాధితుని ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువతి అదృశ్యం

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం), న్యూస్‌టుడే: యువతి అదృశ్యమైన ఘటన కుకునూరుపల్లి మండలంలో చోటుచేసుకుంది. శనివారం కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఈ నెల 22న హైదరాబాద్‌కు వెళ్లారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. చిన్న కుమార్తె, కుమారుడు పొలం వద్దకు వెళ్లగా.. పెద్ద కుమార్తె(24) కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.